క్లుప్తంగా

పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా సాల్మన్‌రాజు



పిఠాపురం: వైఎస్సార్‌ సీపీ అధినేత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ పార్టీ ఎంప్లాయీస్‌ పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా పిఠాపురానికి చెందిన దువ్వాడ సాల్మన్‌రాజును నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా సమర్థవంతమైన సేవలందిస్తానని ఆయన తెలిపారు.

నేడు ప్లాస్టిక్‌ నిషేధంపై సదస్సు

సామర్లకోట: స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివాస్‌ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 8.30 గంటలకు స్థానిక స్టేషన్‌ సెంటర్‌లోని గడియార స్తంభం వద్ద ప్లాస్టిక్‌ నిషేధంపై అవగాహన సదస్సు జరుగుతుందని మున్సిపల్‌ కమిషనర్‌ ఎ.శ్రీవిద్య శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సులో మహిళా సంఘాల ప్రతినిధులు, వ్యాపార సంస్థల ప్రతినిధులు, కౌన్సిలర్లు, మున్సిపల్‌ సిబ్బంది పాల్గొనాలన్నారు.

బాధితులకు సాయం

సామర్లకోట: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో అనారోగ్యానికి గురై ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదలైన ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప శుక్రవారం అందజేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకుడు బడుగు శ్రీకాంత్‌ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చెక్కులు పంపిణీ చేశారు.


ఎందుకో వదిలేశారు!



సామర్లకోట మఠం సెంటర్‌లో అసంపూర్తిగా ఉన్న కల్వర్టు

సామర్లకోట: స్థానిక మఠం సెంటర్‌లో కల్వర్టును అసంపూర్తిగా నిర్మించడంతో ప్రమాదకరంగా మారింది. అంబటి షాపింగ్‌ కాంప్లెక్స్‌ వద్ద పరిస్థితి ఇది. ఇక్కడ ఎస్‌బీఐ ఏటీఎంతో పాటు రెడీమేడ్‌ దుస్తుల దుకాణం, కంప్యూటర్‌ సెంటర్లు ఉన్నాయి. దాంతో ఆ కల్వర్టు మీదుగా రోజూ వందలాది మంది రాకపోకలు సాగిస్తూ ఉంటారు. కల్వర్టును అసంపూర్తిగా ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకున్న మరిడమ్మ వారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ వారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్‌ కమిషనర్‌ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



గొంచాల గ్రామంలో వేంకటేశ్వరస్వామి

సామర్లకోట: గొంచాల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామివారి శ్రవణా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు ఉంటాయని ఆలయ కమిటీ ధర్మకర్త ముమ్మిడి వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అలంకరణలు ఉంటాయన్నారు. భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

విశ్వమానవ హక్కుల దినోత్సవం

కాకినాడ రూరల్‌: తిమ్మాపురంలో అచ్చంపేట జంక్షన్‌ వద్ద నన్నయ ఎంఎస్‌ఎన్‌ పీజీ సెంటరులో ఇంగ్లిషు విభాగం ఆధ్వర్యంలో నెల్సన్‌ మండేలా జయంతిని పురస్కరించుని శుక్రవారం విశ్వమానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్‌, ప్రొఫెసర్‌ ప్రశాంతిశ్రీ, ఎం.పోచయ్య, రాధామాధవి నెల్సన్‌ మండేలా చిత్రపటానికి నివాళులర్పించారు.

రోగి ఓపికకు పరీక్ష

- ఆధార్‌ లింకుతో ఓటీపీ చెబితేనే ఓపీ చీటీ
- పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో దిగజారిన సేవలు
- ఆన్‌లైన్‌ విధానంతో రోగులకు ఇక్కట్లు
- గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి



పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో ఓపీ చీటీల కోసం రోగుల పడిగాపులు



ఓపీ చీటీల కోసం ఆధార్‌ కార్డులతో అవస్థలు పడుతున్న రోగులు

పిఠాపురం: సర్కారు వైద్యం దూరమవుతోంది.. రానురాను సమస్య అవుతోంది.. అనారోగ్యమని వెళ్తే గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది.. ప్రభుత్వ విధానాలతో వైద్యం చేయించుకోవడానికి ప్రభుత్వాసుపత్రికి వెళ్లాలంటేనే భయపడే రోజులు తెచ్చింది. 'వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తున్నాం, ఎక్కడా లేని వైద్య సేవలు తీసుకొస్తున్నామంటూ' నియోజకవర్గ ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి పవన్‌ కల్యాణ్‌ చెప్పిన మాటలు నెరవేరతాయో లేదో తెలియదు గానీ రోగులకు వైద్యం సకాలంలో అందక నరకం చూస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గ పరిధిలో పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీ, గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి మండలాల్లో 51 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు 2.50 లక్షల మంది ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వందల మంది రోగులతో పిఠాపురం ప్రభుత్వాసుపత్రి కిటకిటలాడుతోంది. రోజుకు సుమారు 400 మంది ఇక్కడ వైద్య సేవలు పొందుతుంటారు.

ఇదో రకం లింకు..

వైద్య సేవల కోసం వచ్చే రోగులకు ఆధార్‌ లింకు పెట్టడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి రోగి తమ ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవడంతో పాటు ఆధార్‌ నంబరు ఆన్‌లైన్‌ చేశాక దాని ఓటీపీ చెబితేనే ఓపీ చీటీ ఇస్తామంటూ నిబంధన పెట్టడంతో రోగులు నరకం చూస్తున్నారు. కనీసం నడవలేని స్థితిలో వైద్యం కోసం వచ్చే రోగులు తమ వెంట ఆధార్‌ కార్డు తెచ్చుకోవడం మర్చిపోతే ఇక వైద్య సేవలే లేనట్టే. దీంతో రోగంతో తిరిగి ఇంటికి వెళ్లలేక వైద్యం అందక రోగులు పడుతున్న వేదన వర్ణనాతీతం.

ఓటీపీ చెబితేనే ఓపీ చీటీ

కొందరు ఆధార్‌కార్డు తెచ్చుకున్నా వారి వద్ద సెల్‌ఫోన్‌ లేకపోతే ఇక వారికి వైద్య సేవలు అందనట్టే. ఎందుకంటే సెల్‌ఫోన్‌లో ఓటీపీ నంబర్‌ చెబితేనే వారికి ఓపీ చీటీ ఇస్తామంటూ పెట్టిన నిబంధన రోగుల పాలిట శాపంగా మారింది. దీంతో రోజూ వందల మంది రోగులు ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్లు లేక వెనుదిరుగుతున్నారు. సాధారణంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఒకసారి ఓపీ చీటి రాయించుకుంటే ఎన్నిసార్లు ఆసుపత్రికి వచ్చినా వైద్యం చేస్తుంటారు. దీనివల్ల ఓపీ అస్తమానూ రాయించుకునే పని లేకుండా వచ్చిన వెంటనే వైద్యం అందించేవారు రోగికి ఇబ్బంది లేకుండా ఉండేది. ఇదే పద్ధతి గతంలోనూ కొనసాగింది. ప్రస్తుతం ఒక రోగి ఎన్నిసార్లు ఆసుపత్రికి వస్తే అన్నిసార్లూ ఓపీ టిక్కెట్‌ రాయించుకోవాల్సిందేనని నిబంధన పెట్టి ఓపీ రాస్తున్నారు. దీంతో క్యూలైన్లో గంటల తరబడి నిల్చుని ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు రోజులుగా ఇంతే..



రెండు రోజులుగా తిప్పుతున్నారు. ఒక రోజు ఆధార్‌ కార్డు లేదని వైద్యం చేయలేదు. ఇప్పుడు ఆధార్‌కార్డు తెచ్చుకుంటే సెల్‌ఫోన్‌ లేదంటున్నారు. అసలే వృద్ధురాలిని ఇక్కడకు రావడానికే ఓపిక లేదు. అయినా ఆరోగ్యం బాగోక వైద్యం చేయించుకుందామని వస్తే ఇలా తిప్పుతున్నారు. వైద్యం మాట అటుంచితే తిరగలేక ప్రాణం పోయేలా ఉంది. – **మారిశెట్టి చిట్టమ్మ,** చిత్రాడ, పిఠాపురం మండలం

ఇదేం దారుణం



ఆధార్‌కార్డు అంటే ఇచ్చాం. ఓటీపీ వస్తాది చెప్పండి అంటున్నారు. ఉదయం 8 గంటలకు వచ్చాం. మధ్యాహ్నం 1 గంట అయ్యింది. ఓటీపీ రాలేదు. దీంతో మాకు వైద్యం చేయనంటున్నారు. ఓటీపీ ఎప్పుడు వస్తే అప్పుడే వైద్యం అంటే ఓటీపీ రాకపోతే చచ్చిపోయినా పర్వాలేదా. ఇదేం దారుణమో అర్థం కావడం లేదు. వృద్ధులు, దివ్యాంగులైతే ఈ బాధలు భరించలేక ఇక్కడే ప్రాణాలు వదిలేసేలా ఉన్నారు. – **గరగ సూరిబాబు,** కుమారపురం, పిఠాపురం మండలం

గంట తరబడి లైన్లో..



ప్రతి రోజూ ఆధార్‌కార్డు నమోదు చేస్తున్నారు. ఇది చేయడానికి గంటల తరబడి లైన్లో ఉండాల్సి వస్తోంది. తీరా అది అయ్యాకా ఓటీపీ అంటున్నారు. అది ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు. ఎంతో నీరసంతో వచ్చే మేము ఇంకా నీరసం వచ్చి లేని రోగాలకు గురవుతున్నాం. ఎప్పుడు ఇలాంటి నిబంధనలు చూడలేదు. – **మొగలి గంగ,** పిఠాపురం

కాళ్లరిగేలా తిప్పుతూ..



గత ప్రభుత్వంలో వెంటనే వైద్యం అందించేవారు. ఇప్పుడు జ్వరంతో వస్తే కాళ్లరిగేలా ఆస్పత్రి చుట్టూ తిరిగి క్యూలో ఉంటే ఆధార్‌ కార్డు చూపించి ఓటీపీ చెప్పి అన్నీ అయ్యాక వైద్యం చేసే నాథుడు లేక జ్వరం పెరిగి లేని ఒళ్లు నొప్పులు వచ్చి వెళ్లాల్సి వస్తోంది. చాలామంది అప్పోసొప్పో చేసుకుని ప్రైవేట్‌ ఆస్పత్రులకు వెళ్లిపోతున్నారు. – **జి.పార్వతి,** పిఠాపురం

నేడు వైఎస్సార్‌ సీపీ సమావేశం

పెద్దాపురం: వైఎస్సార్‌ సీపీ పెద్దాపురం పట్టణ విస్తృత సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ నెక్కంటి సాయిప్రసాద్‌ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ స్థానిక అంబేడ్కర్‌ భవనంలో మధ్యాహ్నం మూడు గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. దీనికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్‌ దవులూరి దొరబాబు, మున్సిపల్‌ చైర్మన్‌ బొడ్డు తులసీ మంగతాయారు హాజరవుతారన్నారు. పట్టణంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని అన్నారు.

దళితుల ఐక్యతపై దేశవ్యాప్త కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ రత్నాకర్‌

పెద్దాపురం: ఎస్సీ వర్గీకరణ అంటూ దళితుల ఐక్యతపై దేశ వ్యాప్తంగా రాజకీయ కుట్ర జరుగుతుందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు ఆర్‌ఎస్‌ రత్నాకర్‌ అన్నారు. స్థానిక మున్సిపల్‌ సెంటర్‌లోని అంబేడ్కర్‌ భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్‌ పేరుతో వంద మందిలో కేవలం నలుగురికి లబ్ధి జరుగుతుందని, రిజర్వేషన్‌ పేరుతో దళితులకు వేసేది ఎంగిలి మెతుకులు మాత్రమేనన్నారు. ఎస్సీ వర్గీకరణ ముసుగులో వాటాల కోసం దేశ వ్యాప్తంగా ఎస్సీ జాబితాల్లో ఉన్న 1108 ఎస్సీ కులాలు నిరంతరం కొట్టుకునే విధంగా మోదీ, చంద్రబాబు కుట్ర పన్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పక్కదోవ పట్టించేందుకే ఎస్సీ వర్గీకరణ తెరపైకి తీసుకువచ్చారన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా శాంతియుత పోరాటం కొనసాగిస్తామని ఆయన తెలిపారు. సమావేశంలో కొప్పుల ప్రేమ్‌బాబు, దుర్గాప్రసాద్‌, కాకర రవితేజ, నెల్లి సూరిబాబు, బచ్చల చిన్న, నడిపూడి రమణ, బెందుకుర్తి పాండురంగ తదితరులు పాల్గొన్నారు.

మహిళా చైతన్యంలో ముందంజ



దవులూరి దొరబాబును సత్కరిస్తున్న వాసవీ క్లబ్‌ ప్రతినిధులు

సామర్లకోట: మహిళలను అన్ని విషయాల్లో చైతన్యవంతం చేయడంలో వాసవీ క్లబ్‌ ముందంజలో ఉందని వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్‌ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక పూర్ణా కల్యాణ మండపంలో శుకవారం జరిగిన వాసవీ పద్మశ్రీ మెగా షోలో ఆయన పాల్గొన్నారు. వాసవి క్లబ్‌ పేదలకు సేవా కార్యక్రమాలు చేయడంలో ముందంజలో ఉందన్నారు. మరో ముఖ్య అతిథి ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ వాసవీ క్లబ్‌ సేవలను అభినందించారు. ప్రోగ్రామ్‌ చైర్మన్‌ కటకం హైమామతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ కొత్త వెంకటేశ్వరరావు, పారిశ్రామిక వేత్త మట్టే శ్రీనివాస్‌, వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర అయ్యారక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కటకం త్రిమూర్తులు, కిరాణా మర్చెంట్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు మట్టపల్లి శ్రీనివాసు, సౌభాగ్య సేవా కల్ప ఇంటర్నేషనల్‌ ఎగ్జిక్యూటివ్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ శిద్దా వెంకట సూర్యప్రకాశరావు, వాసవీ వనితా క్లబ్‌ జిల్లా వైస్‌ గవర్నర్‌ కటకం రత్నకుమారి, వాసవీ వనితా క్లబ్‌ అంతర్జాతీయ అడ్మినిస్ట్రేషన్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ నాళం ఆండాళ్‌, లయన్స్‌ క్లబ్‌ జిల్లా అధ్యక్షుడు చిత్తూలూరి వీర్రాజు పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా సత్కరించారు.

స్మార్ట్‌ మీటర్లను వ్యతిరేకించండి



పిఠాపురంలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

పిఠాపురం: విద్యుత్‌ స్మార్ట్‌ మీటర్లను బిగించడానికి వస్తే వ్యతిరేకించాలని సీపీఐ నాయకుడు సాకా రామకృష్ణ పిలుపునిచ్చారు. సీపీఐ దశల వారీ పోరాటంలో భాగంగా శుక్రవారం స్థానిక ఉప్పాడ బస్టాండ్‌ వద్ద స్మార్ట్‌ మీటర్‌ నమూనాలను పగలగొడుతూ నిరసనలు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలో స్మార్ట్‌ మీటర్ల పేరుతో అదాని ఆస్తులు పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నాగం పన్నుతున్నాయన్నారు. వినియోగదారులకు ఇబ్బందిగా మారే స్మార్ట్‌ మీటర్ల బిగింపు నిలిపివేయాలని ఆయన డిమాండ్‌ చేశారు. పెంచిన విద్యుత్‌ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్‌ మీటర్లు అంటే ఏంటో ప్రజలకు తెలియజేయకుండా దౌర్జన్యంగా షాపులకు బిగిస్తున్నారని అన్నారు. కూటమి నాయకులు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్‌ మీటర్లు బిగిస్తే నేలకేసి బద్దలుకొట్టాలని యువగళం కార్యక్రమం ద్వారా లోకేష్‌ పిలుపునిచ్చిన సంగతిని అధికారంలోకి వచ్చాక మర్చిపోయారన్నారు. కార్యక్రమంలో గొల్లప్రోలు కార్యదర్శి పాలిపి డాక్టర్‌ బాబు, మహిళా సమైక్య నాయకురాలు కేస అరుణ, పేపకాయల ప్రసాద్‌, బల్లిపాటి శ్రీను, గంధం సుబ్రహ్మణ్యం, పెదపాటి సత్తిబాబు పాల్గొన్నారు.

పంట కాలువల్లో పూడిక తొలగించండి



అధికారికి రైతుల తరఫున వినతి పత్రం అందజేస్తున్న రైతు

పిఠాపురం: ప్రస్తుత ఖరీఫ్‌ సీజన్‌లో పంట కాలువల్లో పూడిక తీయడానికి నాయకులు కొబ్బరికాయలు కొట్టారు.. దీంతో కాలువలు బాగు పడతాయని భావించాం. కానీ ఏ కాలువలోనూ సక్రమంగా పూడక తీయలేదు. వెంటనే వాటిని బాగు చేయించండంటూ గొల్లప్రోలుకు చెందిన పలువురు రైతులు శుక్రవారం నీటిపారుదల శాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. గోదావరి కాలువలో పూడికతీత పనుల్లో భాగంగా ముఖ్యమైన కాలువలను వదిలేసి చిన్న కాలువల్లో అక్కడక్కడా మాత్రమే పూడిక తీస్తున్నారని రైతులు ఆరోపించారు. మురికి నీరు, అదనపు జలాలు పోయే పాటి కాలువ, గండేవారి కాలువ పూడికతీత పనులు చేపట్టాలని అధికారులు, నాయకుల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఖరీఫ్‌కు ఆటంకం లేకుండా వెంటనే పాటి కాలువ, గండేవారి కాలువ పూడికతీత పనులు ప్రారంభించాలని రైతులు విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

దాడిశెట్టి రాజాను కలసిన అయ్యారావు



దాడిశెట్టి రాజాను సత్కరిస్తున్న అయ్యారావు

పిఠాపురం: మాజీ మంత్రి, వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజాను వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర మున్సిపల్‌ విభాగం ప్రధాన కార్యదర్శి మొగలి అయ్యారావు శుక్రవారం తునిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీల్లో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం రాజాను సత్కరించారు.

అపర్ణాదేవికి ఆషాఢం సారె



అపర్ణాదేవికి సారె సమర్పిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వెలసిన అపర్ణాదేవి అమ్మవారికి శుక్రవారం స్థానిక ముత్తయిదువులు ఆషాఢం సారె సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఆకొండి ప్రభాకరశాస్త్రి ఆధ్వర్యంలో అమ్మవారికి సారె నివేదించారు. అనంతరం పలువురు మహిళలు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక అలంకరణ జరిగింది.

పోర్టు భద్రతకు పటిష్ట చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్‌

కాకినాడ క్రైం: స్థానిక పోర్టు భద్రతకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌ తెలిపారు. శుక్రవారం కాకినాడలోని జిల్లా పోలీస్‌ కార్యాలయంలో పోర్టు రక్షణపై పోర్టు అధికారులు, కోస్టుగార్డు, మెరైన్‌, కస్టమ్స్‌, స్పెషల్‌ ప్రొటెక్షన్‌ ఫోర్స్‌, కేఎస్‌పీఎల్‌, జిల్లా పోలీస్‌ అధికారులతో కలసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పోర్టు భద్రత తమ ప్రాథమిక విధి అని పేర్కొంటూ, దానికి పటిష్ట చర్యలు చేపడుతున్నామన్నారు. పోర్టు పరిసరాలన్నీ సీసీ, డ్రోన్‌ కెమెరాల నిఘాలో ఉన్నాయని తెలిపారు. చమురు అక్రమ రవాణాను నియంత్రించేందుకు తగిన చర్యలు చేపడుతున్నామన్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో అనుమానితులు, అనుమానాస్పద పడవలను పూర్తి స్థాయిలో పరిశీలించాలని సూచించారు. కోస్టుగార్డు, మెరైన్‌, కస్టమ్స్‌, పోర్టు పీఎస్‌ విభాగాలు కలసి గస్తీ నిర్వహించాలన్నారు. పోర్టు లోపలి ఎగుమతి దిగుమతులపై నిఘా ఉంచాలన్నారు. సమావేశంలో కాకినాడ ఎస్‌డీపీఓ దేవరాజ్‌ మనీష్‌ పాటిల్‌, పోర్ట్‌ ఆఫీసర్‌ ధర్మశాస్త్ర, కేఎస్‌పీఎల్‌ నుంచి ఎస్‌ఎల్‌ శ్రీనివాస్‌, కోస్టుగార్డ్‌ పోలీస్‌ అధికారి దివాకరం తదితరులు పాల్గొన్నారు.

'సూపర్‌ సిక్స్‌' అమలులో పూర్తిగా విఫలం

- ప్రజలను నమ్మించి మోసం చేసిన బాబు
- నియోజకవర్గ వైఎస్సార్‌ సీపీ ఇన్‌చార్జి గీత



సమావేశంలో మాట్లాడుతున్న పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్‌ సీపీ ఇన్‌చార్జి గీత



హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

కొత్తపల్లి: ఎన్నికల ముందు సూపర్‌ సిక్స్‌ పథకాలంటూ చంద్రబాబు హామీలు ఇచ్చి, నేడు ప్రజలను అన్ని విధాలా మోసం చేస్తున్నారని మాజీ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్‌ సీపీ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. స్థానిక ముప్పారపు అచ్చియ్యమ్మ కళ్యాణ మండపంలో శుక్రవారం మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్‌ అధ్యక్షతన బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీపై మండల వైఎస్సార్‌ సీపీ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించామన్నారు. వలంటీర్‌ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి సేవలు అందించిన ఘనత తమదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా సూపర్‌ సిక్స్‌ పథకాలను అమలు చేయడం లేదన్నారు. ఇవే కాకుండా 100కు పైగా హామీలిచ్చి పక్కనబెట్టేసిందని అన్నారు. వైఎస్సార్‌ సీపీ పోరాడితే సంవత్సరానికి ఒక్క పింఛన్లు తప్ప ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. తల్లికి వందనం పథకంలో లబ్ధిదారులందరికీ న్యాయం జరగలేదన్నారు. తాము అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, అప్పటి వరకూ నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు ఇస్తామన్న హామీ ఏమైందంటూ గీత ప్రశ్నించారు. 19 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.15,00 ఎప్పుడిస్తారని నిలదీశారు. రైతులను పూర్తిగా మోసం చేశారన్నారు. రెండు పంటలు పూర్తయినా అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయడం లేదన్నారు. ధాన్యానికి సరైన మద్దతు ధర ఇవ్వకపోగా, కొనుగోలు చేసిన ధాన్యానికి కూడా నెలల తరబడి సొమ్ము ఇవ్వడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్నదాత సుఖీభవ పథకాన్ని లబ్ధిదారుల ఎంపిక పేరుతో నిలుపుదల చేయడం దారుణమన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని అన్నారు. వైఎస్సార్‌ సీపీకి కార్యకర్తలే వెన్నెముక అని అన్నారు. వైఎస్సార్‌ జిల్లా కార్యదర్శి కారే శ్రీనివాసరావు మాట్లాడుతూ పూర్తి స్థాయిలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. 2029 ఎన్నికల్లో పార్టీ విజయం తథ్యమన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గుబ్బల తులసీకుమార్‌ మాట్లాడుతూ పార్టీ అధికారంలో ఉన్నా, లేకపోయినా కార్యకర్తలే బలమన్నారు. ఇటీవల పార్టీ పదవులలో నియమితులైన వారిని అభినందించారు. సమావేశంలో రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి దొరబాబు, జిల్లా కార్యదర్శి కాదులూరి చంటిప్రియ, పిఠాపురం నియోజకవర్గ అంగన్‌వాడీ కేంద్రాల సమన్వయకర్త వెంకటలక్ష్మి, వైస్‌ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్‌, జెడ్పీటీసీ మాజీ సభ్యులు రావు చిన్నారావు, వెంగళి సుబ్బారావు, సర్పంచులు కర్రి చిన్నారావు, తమిలిశెట్టి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పుగా మాట్లాడితే కేసులు నమోదు చేయండి



విలేకరులతో మాట్లాడుతున్న వంగా గీత

కొత్తపల్లి: మహిళల పట్ల తప్పుగా మాట్లాడితే ఏ పార్టీకి చెందిన వారైనా సుమోటోగా కేసులు నమోదు చేయాలని మాజీ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్‌ సీపీ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. మాజీ మంత్రి రోజాపై ఎమ్మెల్యే భానుప్రకాష్‌ చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండించారు. స్థానిక విలేకరులతో గీత మాట్లాడుతూ రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె పరువుకు భంగం కలిగించే విధంగా అసభ్య పదజాలంతో అవమానకరంగా మాట్లాడడం ఎంతవరకూ సమంజసమన్నారు. ఇకనైనా వ్యక్తిగత విమర్శలు మానుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాకినాడలో తమను ఇబ్బంది పెడుతున్నారని 55 మంది నర్సింగ్‌ విద్యార్థినులు చెప్పినా మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టించుకోలేదన్నారు. కనీసం వారితో మాట్లాడలేదన్నారు.